సాక్షి వికారాబాద్

శనివారం । 8 । జూలై । 2023



బోనమెత్తిన పల్లెలు

చౌడాపూర్, కుల్కచర్ల మండలాల్లో శుక్రవారం పోచమ్మతల్లి బోనాలను శోభాయమానంగా నిర్వహించారు. 8లో ▸



న్యాయం జరిగే వరకు..

రాహుల్‌గాంధీకి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినదించారు. 8లో ▸



చిగురిస్తున్న ఆశలు

ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు సాగు చేసిన పంటలు ఊపిరి పోసుకుని, పచ్చగా కళకళలాడుతున్నాయి. 9లో ▸

న్యూస్‌రీల్

11న స్పాట్ కౌన్సెలింగ్

కొడంగల్ రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర) కొడంగల్‌లో ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ, బైపీసీ)లో చేరేందుకు నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్స్‌పల్ బలరాం సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 11న ఉదయం 10గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కుల్కచర్లలోని గిరిజన గురుకుల కళాశాలకు హాజరు కావాలన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు



ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

వికారాబాద్ అర్బన్: ర్యాగింగ్ చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది టి.వెంకటేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయడం నేరమని తెలిపారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే కళాశాల నుంచి సస్పెన్షన్ చేయడంతో పాటు, విద్యా సంస్థ నుంచి పూర్తిగా పంపించే అవకాశం ఉంటుందన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టం సెక్షన్- 4 ప్రకారం ఆరు నెలల పాటు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. అనవసరమైన కేసుల్లో ఇరుక్కోకుండా బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో 'కొప్పుల'



పరిగి: స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శుక్రవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తన నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

దుద్యాల సర్పంచ్‌పై వేటు



మహ్మద్ ఖాజా

బొంరాస్‌పేట: ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై దుద్యాల సర్పంచ్‌పై తొలగింపు వేటు పడింది. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీలోని రూ. 15,48,857 నిధులు దుర్వినియోగమైన కారణంగా సర్పంచ్ మహ్మద్ ఖాజాను తొలగిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. దీనిపై గత మార్చి నుంచి మే వరకు ఫిర్యాదులు, సంజాయిషీలు, విచారణలు జరిగాయి. విచారణలో భాగంగా దుద్యాల సర్పంచు ఖాజా, ఉప సర్పంచు నవనీత, జూనియర్ పంచాయతీ కార్యదర్శి జైపాల్‌పై చర్యలు తీసుకునేందుకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం సర్పంచును తొలగిస్తూ నోటీసు అందింది. దీనిపై సరైన చర్యలకు ఉమ్మడి బొంరాస్‌పేట మండల ఎంపీడీఓ, మండల పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు సరైన విచారణ చేస్తామని ఎంపీడీఓ పాండునాయక్ తెలిపారు. ఇదిలా ఉండగా సర్పంచ్‌ను తొలగించడం రాజకీయ కక్షలో భాగమేనని కాంగ్రెస్ దుద్యాల మండల అధ్యక్షుడు శేఖరయ్య ఆరోపించారు.

రోడ్డు సమస్యపై కలెక్టర్‌కు వినతి


బొంరాస్‌పేట: రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. మహంతీపూర్, మద్దిమడుగుతండాకు బొంరాస్‌పేట శివారు నుంచి 30 ఏళ్ల క్రితం అధికారికంగా రోడ్డు నిర్మాణం జరిగిందని, ప్రస్తుతం సమీప రైతులు రోడ్డు సౌకర్యానికి అడ్డుపడుతున్నారని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సర్వేచేసేందుకు ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారని చెప్పారు. ఇందులో సర్పంచ్ మహిపాల్, మాజీ సర్పంచు మొగులయ్య, ఉపసర్పంచు దేవుసింగ్ స్థానికులు ఉన్నారు.

పేరుకే అధ్యక్షులు!

ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన జిల్లా అధ్యక్షులందరూ నామ్‌కే వాస్తేగా తయారయ్యారు. దీంతో వచ్చే ఎన్నికల్లో వీరు ఎంతమాత్రం ప్రభావం చూపగలరనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి కట్టబెట్టిన బాధ్యతలను ఏనాడూ సీరియస్‌గా తీసుకున్న సందర్భాలు లేవు. ఏళ్ల తరబడి పదవుల్లో కొనసాగుతున్నా ఆయా పార్టీల బలోపేతానికి పెద్దగా చేసిందేమీ లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉత్సవ విగ్రహాలుగా ప్రధాన పార్టీల జిల్లా బాధ్యులు

- సొంత పార్టీలోనే గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు
- ఎన్నికలు సమీపిస్తున్నా తొలగని అంతర్గత విభేదాలు
- ఒకే నియోజకవర్గానికి పరిమితమవుతున్న వైనం



మెతుకు ఆనంద్ / రామ్మోహన్‌రెడ్డి / సదానందరెడ్డి

వికారాబాద్: బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ జిల్లా బాధ్యుల పనితీరుపై ప్రజలతో పాటు ఆయా పార్టీల కార్యకర్తలు సైతం అసంతృప్తిగా ఉన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు విఫలమయ్యారనేది బహిరంగ రహస్యం. ఇదే సమయంలో ప్రత్యర్థి పార్టీలను ఇరుకున పెట్టే విధంగా అధికార పార్టీ అధ్యక్షుడు ఎంతమాత్రం ప్రభావం చూపలేకపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పరిగి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి గతంలోనూ ఓసారి డీసీసీ అధ్యక్ష పదవిలో కొనసాగారు. అధికార బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టగా.. జిల్లాలో పార్టీని ఏకతాటిపై నడిపించడంలో పెద్దగా సక్సెస్ కాలేదు. సదానందరెడ్డి మూడేళ్లుగా బీజేపీ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. పార్టీని ఏకం చేయలేకపోయారనే విమర్శలతో పాటు ఓ వర్గాన్ని పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఇతర పార్టీలైన బీఎస్పీ, టీడీపీ, వైఎస్సార్ టీపీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎవరో కూడా జనాలకు తెలియని పరిస్థితి. వామపక్ష పార్టీలు అధికార పార్టీతో అంటకాగడం మొదలైనప్పటి నుంచి వీరి ప్రాభవం తగ్గుతూ వస్తోంది. పార్టీ కీలక పదవుల్లో కొనసాగుతున్నవారు ముడు నెలలు, ఆరు నెలలకు ఒకసారి ప్రెస్‌మీట్లు, ప్రెస్‌నోట్ల పేరుతో మీడియా ముందుకు రావడం తప్ప చేసిందేమీ లేదు. మరికొందరు తమ సొంత నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ఇలా ఏ పార్టీ అయినా అధ్యక్షులు మాత్రం ఉత్సవ విగ్రహాల్లాగే మిగిలిపోతున్నారు.

మార్పు తథ్యమేనా?

సదానందరెడ్డి బీజేపీ జిల్లా బాధ్యతలు చేపట్టింది మొదలు పార్టీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఓ పక్క రాష్ట్ర స్థాయిలో బీజేపీ నాయకత్వం .. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ధర్నాలు, ఆందోళనలు చేస్తుండగా.. జిల్లాలో మాత్రం మొక్కుబడిగా మమ అనిపించేస్తున్నారు. దీనికి తోడు పార్టీలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలతో రెండుమూడు వర్గాలుగా విడిపోయారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగాల్సిన అధ్యక్షుడే వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఆయనను బాధ్యతల నుంచి తప్పించే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

డీసీసీ ప్రభావం అంతంతే..

రెండోసారి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రామ్మోహన్‌రెడ్డి కేవలం తన సొంత నియోజకవర్గమైన పరిగికే పరిమితమయ్యారు. తాండూరు నియోజకవర్గంలో రమేశ్‌మహరాజ్ ఇన్‌చార్జ్‌గా ఉండగా జిల్లా అధ్యక్షుడి హోదా లో ఏడాదికోసారి కూడా రామ్మోహన్ రెడ్డి వెళ్లలేదు. ఇక కొడంగల్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోదరుడు కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరైన సందర్భాలు అరకొరే. ఇక వికారాబాద్‌లో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఉండటంతో జిల్లా స్థాయి కార్యక్రమాలకు పార్టీ పిలుపునిస్తే తప్ప ఇక్కడ కూడా కనిపించరు. దీంతో జిల్లా అధ్యక్షుడిగా ఆయన పాత్ర నామమాత్రమేనని స్పష్టమవుతోంది. ఇక తన సొంత నియోజకవర్గమైన పూడూరులో ఆయనతో సంబంధం లేకుండానే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విభేదాలకు అద్దంపడుతోంది.

బీఆర్ఎస్‌లో ఎవరికి వారే..!

జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఇలా ప్రముఖులందరూ ఒకే పార్టీలో ఉన్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరోజు కూడా అంతా కలిసి నడిచిన దాఖలాలు లేవు. ప్రతీ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు రెండుమూడు గ్రూపులుగా విడిపోయాయి. ఆనంద్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇవి మరింతగా పెరిగాయి. గతంలో ఒక్క తాండూరుకే పరిమితమైన వర్గవిభేదాలు ప్రస్తుతం జిల్లా అంతటా వ్యాపించాయి. ఇక జిల్లా అధ్యక్షుడిగా ఆయన ఒకటి రెండుసార్లు మినహా పక్క నియోజకవర్గాల్లో కాలు పెట్టిన సందర్భాలు లేవు. పార్టీ శ్రేణులను లీడ్ చేయడంలో ఆనంద్ ఫెయిలయ్యారనే వాదనలు ఉన్నాయి.



శాకాంబరీ మాతగా రేణుకా నాగఎల్లమ్మ

శాకాంబరీగా నాగఎల్లమ్మ

తాండూరు నెహ్రూగంజ్‌లోని శ్రీరేణుకా నాగఎల్లమ్మ తల్లి శుక్రవారం శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– తాండూరు టౌన్

ఆగిన తవ్వకాలు

- 'సాక్షి' కథనానికి స్పందించిన తహసీల్దార్
- మైనింగ్ యంత్రాల స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: 'ఆగని తవ్వకాలు' శీర్షికతో గత బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. అక్రమ మైనింగ్‌పై తహసీల్దార్ చిన్నప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించాలని స్థానిక వీఆర్ఏ నరేందర్‌ను ఆదేశించారు. మైనింగ్‌కు వినియోగిస్తున్న మిషన్లతో పాటు, బ్లేడ్లు, సామగ్రిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కరన్‌కోట్ శివారులోని సర్వే నంబర్- 2 ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న తవ్వకాలను ఆపేయించారు. రెండు రోజుల్లో తాను కరన్‌కోట్‌లో పర్యటిస్తానని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ కనెక్షన్లు సైతం తొలగించేలా ఆ శాఖ అధికారులకు సూచిస్తామని స్పష్టంచేశారు.



కరన్‌కోట్‌లోని ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేస్తున్న యంత్రాలను సీజ్ చేస్తున్న వీఆర్ఏ

డీఎల్‌పీఓ విచారణ

- సీసీ రోడ్ల బిల్లులపై స్థానికుడి ఫిర్యాదు
- చెన్‌గేశ్‌పూర్ పాలకవర్గంతో అధికారుల భేటీ
- నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వెల్లడి

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్‌గేశ్‌పూర్‌లో డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ విచారణ చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో గ్రామంలో వేసిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన డబ్బులు ఇవ్వడం లేదంటూ స్థానికుడు ప్రవీణ్‌గౌడ్.. సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం జీపీకి చేరుకున్న ఆయన విచారణ చేపట్టారు. సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ పార్వతమ్మతో పాటు వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పంచాయతీ తీర్మానం లేకుండానే ప్రవీణ్ పనులు చేశారని వీరు ఈ సందర్భంగా డీఎల్‌పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా పీఆర్ డీఈ, ఏఈలు చెప్పడంతోనే సీసీరోడ్డు వేశానని ప్రవీణ్‌గౌడ్ చెప్పాడు. అయితే తాము కూడా రూ.5 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్డు వేశామని సర్పంచ్ చెప్పారు. దీంతో ప్రస్తుతం విడుదలైన రూ.10 లక్షల బిల్లును చెరిసగం తీసుకోవాలని డీఎల్‌పీఓ సూచించారు. ఇందుకు ప్రవీణ్‌గౌడ్ అంగీకరించకపోవడంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విచారణ నివేదికను కలెక్టర్, డీపీఓకు అందజేస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు రాజుగౌడ్, శ్రీశైలంగౌడ్, వెంకటేశ్, ప్రశాంత్‌గౌడ్, భీంరెడ్డి, సుభాష్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ ఉన్నారు.



పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

పాఠాలకు చోటేదీ?

- తాండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గదుల కొరత
- చెట్ల కింద, వరండాల్లోనే కొనసాగుతున్న తరగతులు
- వేలాది మంది విద్యార్థులున్నా.. కనీస వసతులు కరువు



ప్రారంభ దశలోనే నూతన తరగతి గదుల నిర్మాణ పనులు

తాండూరు టౌన్: ఏళ్ల తరబడి చాలీచాలని తరగతి గదుల్లో కొనసాగుతున్న తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈసారి కూడా కష్టాలు తప్పేలా లేవు. అత్యధిక మంది విద్యార్థులున్న జాబితాలో రాష్ట్రవ్యాప్తంగా ముందువరుసలో ఉన్న కాలేజీలో వసతులు మాత్రం అట్టడుగున ఉన్నాయి. సరిపోయే మేర గదులు లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులు నేలపై కూర్చునే పాఠాలు వింటున్నారు. ప్రైవేటు కళాశాలల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులపై అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు కళాశాలను సందర్శించి గదుల నిర్మాణానికి కావాల్సిన నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి.

2,500 మంది విద్యార్థులు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ,బైపీసీ, సీఈసీ, జనరల్ కోర్సులతో పాటు పలు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.ఏటా జనరల్ కోర్సుల్లో 1,200మంది,ఒకేషనల్ కోర్సుల్లో 1,300 మందికిపైగా విద్యార్థులు చేరుతున్నారు. సుమారు 2,500 మంది ఉన్న కాలేజీలో కనీసం 20 గదులు కూడా లేకపోవడం గమనార్హం. దీంతో చెట్ల కింద,వరండాల్లోనే క్లాసులువినాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.అదనపు గదుల నిర్మాణంపై సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడం గమనార్హం.

వారం క్రితమే పనులు ప్రారంభం..

గతేడాది ఏడు తరగతి గదులు మంజూరైనా.. వీటి అనుమతి, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేసరికే విద్యా సంవత్సరం ముగిసిపోయింది. తాజాగా వారం రోజుల క్రితం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో ఇదే స్థలంలో కొన్ని తరగతి గదులు, లైబ్రరీ తదితర గదులు ఉండేవి. అయితే ప్రస్తుతం నూతన భవన నిర్మాణం ఇదే స్థలంలో నిర్మిస్తుండటంతో.. ఉన్న గదులను కూల్చాల్సి వచ్చింది. దీంతో ఈఏడాది గదుల కొరత మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు మాత్రమే ప్రారంభమయ్యాయి. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవగానే ఫస్టియర్ విద్యార్థులు సైతం కళాశాలకు వస్తారు. వీరికి సరిపోయే మేర గదులు లేక ఇబ్బందులు తప్పేలా లేవు. అరకొర తరగతి గదుల కారణంగా కాలేజీకి వెళ్లేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు. ఏళ్లు గడుస్తున్నా పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టిసారించకపోవడం దారుణం.

ఆపదొస్తే అంతే!

- దౌల్తాబాద్ మండలానికి '108' కరువు
- ప్రజలకు అందని అత్యవసర సేవలు
- పక్క మండలాల అంబులెన్స్‌లే దిక్కు
- అవీ రాకపోతే ప్రైవేటు వాహనాలే గతి



దౌల్తాబాద్: ఆపదలో ఉన్న వారు 108కు ఫోన్ చేస్తే.. సకాలంలో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. దౌల్తాబాద్ మండలానికి ప్రత్యేక వాహనం లేకపోవడమే ఈ దుస్థితికి కారణం. మండలంలో చాలా వరకు మారుమూల గ్రామాలు, పల్లెలు, తండాలు ఉన్నాయి. రాత్రి వేళ ఏ ఆపద ఎదురైనా ప్రైవేటు వాహనాలు పెద్దగా అందుబాటులో ఉండవు. స్థానిక జనాభాలో ఎక్కువశాతం మంది వ్యవసాయం, దీని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పొలాలు, తోటల వద్ద పాములు, తేళ్లు కరిస్తే.. సకాలంలో ఆస్పత్రికి చేర్చేందుకు అనేక తంటాలు పడాల్సిందే. డెలివరీ కేసులకు సంబంధించి సైతం ఇదే పరిస్థితి నెలకొంటోంది. పురిటి నొప్పులతో బాధపడే వారిని దవాఖానాకు తరలించేందుకు సంబంధిత కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు చెప్పలేనివిధంగా ఉంటున్నాయి. బాధితులు 108కు ఫోన్ చేస్తే సమీపంలో ఉన్న కొడంగల్, కోస్గి మండలాల వాహనం రావాల్సి ఉంటుంది. సదరు అంబులెన్స్‌లు ఆయా మండలాల్లో బిజీగా ఉంటే ఇక అంతే సంగతులు. దీంతో చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో వీరు స్పందించకపోతే కాళ్లు, వేళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఎదురవుతోందని బాధితులు చెబుతున్నారు. 108 వాహనంలో డెలివరీ కిట్లతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స కోసం అవసరమైన పరికరాలు మందులు ఉండడం వల్ల బాధితులకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. మండలంలో 50 వేలకుపైగా జనాభా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మండలానికి 108 వాహనం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాదని చెబుతున్నారు



అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉంటే కోస్గి, కొడంగల్ మండలాల నుంచి 108 వాహనాలు పంపుతున్నారు. అక్కడ బిజీగా ఉంటే అంబులెన్స్ రాదని, ప్రత్యామ్నాయం చూసుకోవడమే మేలని చెబుతున్నారు. నియోజకవర్గ నేతలు స్పందించి దాతలతోనైనా వాహనం ఇప్పించేలా చూడాలి.

– కృష్ణయ్యగౌడ్, దౌల్తాబాద్

సేవలు విస్తృతపర్చాలి



మండలంలో ఎక్కువగా గిరిజనతండాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సేవలు మరింత విస్తృతపరిచేందుకు వీలుగా దౌల్తాబాద్ మండలానికి ప్రత్యేకంగా 108 వాహనం కేటాయించాలి. ప్రజా సమస్యలను తీర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఆ దిశగా ప్రయత్నిస్తే బాగుంటుంది.

– నర్సింలు, యూత్ కాంగ్రెస్ నాయకుడు

క్లుప్తంగా

ఏఆర్ డీఎస్పీని కలిసిన హోం గార్డులు



ఏఆర్ డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

వికారాబాద్ అర్బన్: ఏఆర్ డీఎస్పీగా వీరేశం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా హోంగార్డు సంఘం అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో హోం గార్డులు డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అదించారు. అనంతరం ఏఆర్ విభాగంలో పనిచేసే హోం గార్డులు కొత్త డీఎస్పీతో పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో హోంగార్డు సంఘం నాయకులు అంజి, కృష్ణ, బాలు, నర్సింహులు, దశరథ్ తదితరులు ఉన్నారు.

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి



మోమిన్‌పేటలో ఫిర్యాదుదారుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: ఆరు నెలల క్రితం ఫోన్ పోయినా దొరుకుతుందని ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోవిందాపూర్‌కు చెందిన గిర్కాబాయి శేఖర్ ఆటోలో వెళ్తుండగా ఫోన్ కింద పడిపోయింది. అప్పటి నుంచి వెతికినా దొరకలేదు. అయితే.. శేఖర్ రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా శుక్రవారం ఫోన్ ఆచూకీ దొరికిందని, శేఖర్‌కు ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఫోన్లు రికవరీ



ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్

బషీరాబాద్: ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని మంతన్‌గౌడ్‌తండాకు చెందిన సోమ్లానాయక్ మే 5న, నీళ్లపల్లి గ్రామానికి చెందిన నరేశ్ ఏప్రిపల్ 15న ఫోన్‌లను పోగొట్టుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న పోలీసులు.. సీఈఐఆర్ ట్రేస్ చేసి రికవరీ చేశారు. వారికి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌లను అందజేశారు.

క్రీడా ప్రాంగణాలకు స్థలాల గుర్తింపు

ఎంపీడీఓ లక్ష్మప్ప



ఆత్కూర్‌తండాలో క్రీడా ప్రాంగణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్: మండలంలో క్రీడా ప్రాంగణాలకు స్థలాలను అధికారులు గుర్తించారు. అడ్కిచెర్ల, పాషాపూర్, ఆత్కూర్, తండా, ఉరేంటితండా, బాయిమీదితండాల్లో శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మప్ప, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి, అటవీ శాఖ అధికారులు మమత, వెంకటమ్మతో పాటు తదితరులు గ్రామాల్లో పర్యటించి క్రీడా ప్రాంగణాలకు స్థలాలను గుర్తించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేక పోవడంతో అటవీ భూముల్లో 20 గుంటల భూమి చొప్పున గుర్తించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అప్పగించామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే



దోమలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

దోమ : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేట్టారు. ఈ సందర్భంగా అంజయ్య, రాములు, అనంతయ్య, రమేశ్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి రూ. 19,500 వేతనం చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.



వైభవలక్ష్మి ఆలయంలో సామూహిక గీతా పారాయణం

ముగిసిన గీతాపారాయణం

గీతావాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగిన సామూహిక భగవద్గీత పారాయణం ముగిసింది. చివరి రోజైన శుక్రవారం వికారాబాద్‌లోని వైభవ లక్ష్మి ఆలయంలో 500 మంది మహిళలతో పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ మంజుల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గీతావాహిణి అధ్యక్షురాలు టి.శ్రీదేవి, పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి, గీతా వాహిని ఉపాధ్యక్షురాలు మొనిగారి లావణ్య, ప్రతినిధులు స్వరూప, జయశ్రీ, వరలక్ష్మి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరిగుట్ట

కలెక్టరేట్‌పై సూర్యకాంతులు

'కలెక్టరేట్‌పై సూర్య కాంతులు' అన్నట్లు.. జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనంపై విద్యుత్ కాంతుల మాదిరిగా సూర్యుడి కిరణాలు శుక్రవారం సాయంత్రం ఆహ్లాదం కలిగించాయి. వానమబ్బులుగా మేఘాలు కమ్ముకురావడంతో సాయంత్రం మేఘాల మధ్యనుంచి సూర్యకాంతి విద్యుత్ కాంతి రూపంలో అబ్బురపరిచింది. – అనంతగిరి/బొంరాస్‌పేట



కలెక్టర్ కార్యాలయ భవనంపై విద్యుత్ కాంతులరూపంలో సూర్యుడి కిరణాలు

బోనమెత్తిన పల్లెలు

కుల్కచర్ల: చౌడాపూర్, కుల్కచర్ల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ తల్లి బోనాలను శోభాయమానంగా నిర్వహించారు. ముఖ్యంగా బొంరెడ్డిపల్లి, తిర్మలాపూర్, ముజాహిద్‌పూర్, మందిపల్, అంతారం, చాపలగూడెం తదితర గ్రామాలలో అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

దోమ: మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను అందంగా అలంకరించి సమీప ఆలయాలకు డప్పు వాయిద్యాల మధ్య బయల్దేరారు. అలంకరించిన బోనాలతో పాటు కోడి పుంజులతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

లింగంపల్లిలో..

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిదిలోని లింగంపల్లిలో శుక్రవారం రెండో రోజు బోనాల పండుగ ఘనంగా జరిగింది. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ,శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా తరలి వెళ్లారు. అమ్మవార్ల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రకళ ,బీఆర్ఎస్ నేత పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్‌సిటీ కాలనీలో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో వెలిసిన గాలి పోషమ్మ అమ్మవారికి కాలనీ వాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బోనాలతో తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఆలయం ముందు బతుకమ్మ ఆటలు ఆడుతూ అమ్మవారిని పూజించారు.



లింగంపల్లిలో బోనాల ఊరేగింపు



కుల్కచర్ల: అంతారంలో అమ్మవారి ఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణలు



కొడంగల్ రూరల్: బోనాలతో తరలివస్తున్న మహిళలు

షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగ తెగిపోవడంతో స్తంభానికి కట్టారు. అయితే.. సపోర్టు తీగను విద్యుత్ సరఫరా అయ్యే తీగకు ఆనుకొని కట్టడం వలన స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుందని, ఆ ఇంటి యజమాని బెంబేలెత్తుతున్నాడు. వర్షం కురిసినప్పుడు స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బడెంపల్లిలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఈడిగి ఆశన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన స్థానిక నేతలను వారి నివాసానికి పంపించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మంచలిరాజు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం పట్టని ఎమ్మెల్యే

మీతో నేను కార్యక్రమంతో ఒరిగిందేమీలేదు

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి
- కాంగ్రెస్ నాయకుల హౌస్ అరెస్టు



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: ఎమ్మెల్యే నిర్వహిస్తున్న మీతో నేను కార్యక్రమంలో పట్టణ ప్రజలకు ఒరిగేందేమి లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 33 వ వార్డు కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వార్డులో ఎమ్మెల్యే మీతో నేను కార్యక్రమం పర్యటన ఉన్నందున పోలీసులు ముందస్తుగా ఆయనను హౌస్ అరెస్టు చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులను కూడా హౌస్ అరెస్టు చేశారు. అనంతరం బీటీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. పోలీసులతో రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే తన తీరు మార్చుకోవాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా మాకు లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు పోరాడుతామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. యూజీడీ వాహనాలు మరమ్మతుకు గురై రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు మురళీ, వేణుగోపాల్‌రెడ్డి, రెడ్యానాయక్, శ్రీనివాస్, ఖాలెద్, వాహిద్‌మియా, బస్వరాజు , పరుశరాం, జంగయ్య, మల్లికార్జున్ గౌడ్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనం.. అందేదెన్నడో..?

- మూడు నెలలుగా పాత జీతాలతోనే సరిపెడుతున్న వైనం
- ఆందోళనలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు

దౌల్తాబాద్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సర్కారు పెంచిన వేతనం ఇప్పటికీ అమలు కావడంలేదు. పెంచిన వేతనాల కోసం మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని 50 పాఠశాలల్లో 106 మంది మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు పనిచేస్తున్నారు. వంద మందిలోపు విద్యార్థులున్న పాఠశాలల్లో భోజనం వండటానికి ఒకరు, 100నుంచి 200 మందల మంది విద్యార్థులున్న స్కూళ్లలో ఇద్దరు కార్మికులను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. వీరికి ప్రభుత్వం గతంలో వెయ్యి రూపాయల వేతనం అందించేది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరి వేతనాన్ని రూ.3 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు సంతోషించారు. అయితే వేతనాలు పెంచి నెలలు గడుస్తున్నా పెరిగిన వేతనం మాత్రం రావడంలేదు. దీంతో నిరాశ చెందుతున్నారు. పెంచిన వేతనాలను అందించాలని కోరుతున్నారు.

నిధులు రాగానే జమ చేస్తాం



మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు పెంచిన వేతనాలను సంబంధించిన నిధులు రాలేదు. సర్కారు నుంచి నిధులు విడుదల కాగానే ఖాతాల్లో జమ చేస్తాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్



మధ్యాహ్న భోజనం తయారీలో నిర్వాహకులు

జాగ కోసం జగడం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఐదుగురిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన పాండ్యనాయక్

బషీరాబాద్: ఇంటి పక్కన జాగ తమదంటే తమదని రెండు కుటుంబాలు ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నంద్యానాయక్‌తండాలో జరిగింది. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్ పాండ్యనాయక్‌కు తన ఇంటి పక్కన 121 గజాల ఇంటి స్థలం ఉంది. ఆ స్థలం పాండ్యనాయక్‌దే నని కోర్టు ఆర్డర్ కూడా ఉంది. ఇంటి పక్కన ఉన్న కిషన్ నాయక్ అనే వ్యక్తి ఆ స్థలం తనదేనంటూ ముళ్ల కంప నాటారు. మా స్థలంలో మీరెలా ముళ్ల కంప నాటుతావని పాండ్యనాయక్ అతడి భార్య అన్నుబాయి కంపను తొలగిస్తుండగా కిషన్ నాయక్, ఆతడి భార్య దస్లీ బాయి కర్రలతో దాడి చేశారు. దీంతో పాండ్య నాయక్ తలకు తీవ్ర రక్త గాయం అయ్యింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోవైపు తనను కూడా పాండ్యానాయక్, అన్నుబాయి, అతడి సోదరుడు తుల్జానాయక్ దాడి చేశారని కిషన్ నాయక్ కూడా ఫిర్యాదు చేయడంతో ఐదు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, మరో నలుగురికి గాయాలు
- ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో ఘటన
- మృతులు యాచారం వాసులు



పలాస సమీపంలో ప్రమాదానికి గురైన కారు

యాచారం: దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామకృష్ణాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యాచారం మండలం నందివనపర్తికి చెందిన కొండూరి వెంకటయ్య (65), విజయలక్ష్మి దంపతులు నగరంలో నివాసం ఉంటున్న తమ సమీప బంధువులు సముద్రాల కృష్ణ, సముద్రాల పద్మ, గౌరిశెట్టి రజిత(59), డ్రైవర్ జానయ్యలతో కలసి ఐదురోజుల క్రితం కారులో తీర్థయాత్రలకు బయలుదేరారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. తిరుగు పయనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామకృష్ణాపురం జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. దీంతో గౌరిశెట్టి రజిత అక్కడికక్కడే మృతి చెందగా..వెంకటయ్య సమీప ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలొదిలాడు. మిగిలిన వారిని అక్కడి పోలీసులు శ్రీకాకుళం ఆస్పత్రిలో చేర్పించారు. నందివనపర్తి గ్రామానికి చెందిన కొండూరి వెంకటయ్య మంచి వ్యాపారస్తుడుగా గుర్తింపు పొందారు.

వైభవంగా యాగాలు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో కొనసాగుతున్న రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీ సుదర్శన, అతిరుద్ర మహాయాగాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యే దంపతులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొంటున్నారు.

– తాండూరు



సుబ్రహ్మణ్య స్వామి వారిపల్లకీ సేవలో ఎమ్మెల్యే

ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ధరణి పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ ముఖ్య కార్యాదర్శి నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధరణి సమస్యల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి ముఖ్య కార్యదర్శికి వివరించారు. జీవో 58, 59, 76, 118 కింద భూ క్రమబద్ధీకరణ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ధరణి నూతన ఆప్షన్లపై పూర్తి స్థాయిలో అధికారులతో సమీక్ష చేస్తూ, ప్రజలకు కూడా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సెక్షన్ సూపరింటెండెంట్ హరిత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

న్యాయం జరిగే వరకు పోరాటం

పీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

పరిగి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అనర్హతపై స్టేకోసం వేసిన పిటీషన్‌ను గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో శుక్రవారం పట్టణ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పీఎం దిష్టబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అన్యాయాలను ఎండగడితే అనర్హత వేటు వేశారన్నారు. రాహుల్‌గాంధీకి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో పీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యువకుడి నిజాయితీ

- రూ.20 వేలు, పాసుబుక్కు అప్పగింత
- సన్మానించిన సీఐ

తాండూరు టౌన్ : రోడ్డుపై దొరికిన నగదుతో పాటు పాసుబుక్కును అప్పగించిన ఓ యువకుడి నిజాయితీని పలువురు కొనియాడారు. తాండూరు మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌కు శుక్రవారం ఉదయం హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఒక కవర్ దొరికింది. తెరిచి చూడగా అందులో రూ. 20 వేల నగదుతో పాటు, పాసుబుక్కు కనపడింది. దీంతో నిజాయితీగా ఆ యువకుడు దొరికిన కవర్‌ను పట్టణ పోలీసు స్టేషన్‌లో అందజేశాడు. అనంతరం పాసుబుక్కుపై ఉన్న వివరాల ఆధారంగా యాలాల మండలం పగిడియాలకు చెందిన పోకల పద్మమ్మకు చెందినదిగా గుర్తించారు. వెంటనే పట్టణ సీఐ బాధితురాలిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి నగదుతో పాటు పాసుబుక్కును అందజేశారు. నగదుతో ఉన్న కవర్‌ను పోలీసులకు అప్పగించి తన నిజాయితీ చాటుకున్న ప్రవీణ్ కుమార్‌ను సీఐ శాలువాతో సన్మానించారు.



నగదుతో పాటు పాసుబుక్కును పద్మమ్మకు అందజేస్తున్న సీఐ, చిత్రంలో ప్రవీణ్ కుమార్